"మధురమైన పిల్లలూ - జ్ఞాన ధారణను చేస్తూ ఉన్నట్లయితే అంతిమములో మీరు తండ్రి సమానముగా అయిపోతారు, తండ్రి శక్తినంతటినీ మీరు జీర్ణం చేసుకుంటారు"

ప్రశ్న:- ఏ రెండు పదాల స్మృతి ద్వారా మీరు స్వదర్శన చక్రధారులుగా అవ్వగలరు?

జవాబు:- ఉన్నతి మరియు పతనము, సతోప్రధానము మరియు తమోప్రధానము, శివాలయము మరియు వేశ్యాలయము. ఈ రెండు-రెండు విషయాలు స్మృతిలో ఉన్నట్లయితే మీరు స్వదర్శన చక్రధారులుగా అవుతారు. పిల్లలైన మీరు ఇప్పుడు జ్ఞానాన్ని యథార్థ రీతిగా తెలుసుకున్నారు. భక్తిలో జ్ఞానము లేదు, కేవలం మనస్సును సంతోషపట్టుకునే మాటలను మాట్లాడుతూ ఉంటారు. భక్తి మార్గము ఉన్నదే మనస్సును సంతోషపెట్టుకునే మార్గము.

ఓం శాంతి. మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఇప్పుడు పిల్లలైన మీ గురించి తండ్రి అంటారు, మీరు ఎంత ఉన్నతులుగా ఉండేవారు! ఇది ఉన్నతి మరియు పతనము యొక్క ఆట. మనం ఒకప్పుడు ఎంత ఉత్తములుగా మరియు పవిత్రులుగా ఉండేవారము, ఇప్పుడు ఎంత నీచులుగా అయ్యాము అని ఇప్పుడు మీ బుద్ధిలో ఉంది. దేవీ-దేవతల ఎదురుగా వెళ్ళి - మీరు ఉన్నతులు మరియు మేము నీచులము అని మీరే అంటారు. మనమే ఉన్నతోన్నతులుగా మరియు మనమే నీచులుగా అవుతాము అని మొట్టమొదట ఇది మీకు తెలిసేది కాదు. ఇప్పుడు తండ్రి మీకు తెలియజేస్తున్నారు - మధురాతి మధురమైన పిల్లలూ, మీరు ఎంత ఉన్నతులుగా, పవిత్రులుగా ఉండేవారు, మళ్ళీ ఎంత అపవిత్రులుగా అయ్యారు. పవిత్రులను ఉన్నతులు అని అంటారు. దానిని నిర్వికారీ ప్రపంచము అని అంటారు. అక్కడ మీ రాజ్యము ఉండేది, దానిని మళ్ళీ ఇప్పుడు స్థాపన చేస్తున్నారు. తండ్రి కేవలం సూచనను ఇస్తారు - మీరు చాలా ఉత్తములుగా, శివాలయమైన సత్యయుగ నివాసులుగా ఉండేవారు, మళ్ళీ జన్మ తీసుకుంటూ, తీసుకుంటూ సగంలో మీరు వికారాలలోకి పడిపోయారు కావున పతితులుగా, వికారులుగా అయిపోయారు. అర్ధకల్పం వికారులుగా ఉండేవారు, ఇప్పుడు మళ్ళీ మీరు నిర్వికారులుగా, సతోప్రధానులుగా అవ్వాలి. ఈ రెండు పదాలను గుర్తుంచుకోవాలి. ఇప్పుడు ఇది తమోప్రధాన ప్రపంచము. సతోప్రధాన ప్రపంచానికి గుర్తు ఈ లక్ష్మీ-నారాయణులు. ఇది 5000 సంవత్సరాల విషయము. సతోప్రధాన భారత్ లో రాజ్యము ఉండేది. భారత్ చాలా ఉత్తమముగా ఉండేది, ఇప్పుడు కనిష్టముగా ఉంది. నిర్వికారుల నుండి వికారులుగా అయ్యేందుకు మీకు 84 జన్మలు పట్టాయి. అక్కడ కూడా కొద్ది, కొద్దిగా కళలు తగ్గుతూ ఉంటాయి కానీ వారిని సంపూర్ణ నిర్వికారులు అనే అంటారు కదా. పూర్తి సంపూర్ణ నిర్వికారుడు అని శ్రీకృష్ణుడిని అంటారు. వారు తెల్లగా ఉండేవారు, ఇప్పుడు నల్లగా అయిపోయారు. మీరు ఇక్కడ కూర్చున్నారు కావున బుద్ధిలో ఉండాలి - మేము శివాలయములో విశ్వాధిపతులుగా ఉండేవారము, అప్పుడు ఇంకే ధర్మమూ లేదు, కేవలం మా రాజ్యమే ఉండేది, తర్వాత రెండు కళలు తగ్గాయి. కొద్ది-కొద్దిగా కళలు తగ్గుతూ త్రేతా కల్లా రెండు కళలు తగ్గిపోయాయి. ఆ తర్వాత వికారులుగా అవుతారు మరియు కిందకు పడుతూ, పడుతూ ఛీ-ఛీగా అయిపోతారు. దీనిని వికారీ ప్రపంచము అని అంటారు. విషయ వైతరిణీ నదిలో మునకలు వేస్తూ ఉంటారు. అక్కడ క్షీరసాగరములో ఉండేవారు. మీరు మొత్తం ప్రపంచ చరిత్ర-భౌగోళములను, మీ 84 జన్మల కథను కూడా అర్థం చేసుకున్నారు. మనం నిర్వికారులుగా ఉండేవారము, వీరి రాజ్యములో ఉండేవారము, పవిత్ర రాజ్యము ఉండేది, దానిని పూర్తి స్వర్గము అని అంటారు, ఆ తర్వాత త్రేతాలో సెమీ స్వర్గము. ఇది బుద్ధిలో అయితే ఉంది కదా. తండ్రే వచ్చి సృష్టి ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తారు. మధ్యలోనే రావణుడు వచ్చాడు, మళ్ళీ అంతిమములో ఈ వికారీ ప్రపంచము యొక్క వినాశనం జరుగుతుంది. మళ్ళీ ఆదిలోకి వెళ్ళేందుకు పవిత్రముగా అవ్వాలి. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్నొక్కరినే స్మృతి చేయండి. స్వయాన్ని దేహముగా భావించకండి. మీరు భక్తి మార్గములో ప్రతిజ్ఞ చేసారు - బాబా, మీరు వచ్చినట్లయితే మేము మీకు చెందినవారిగానే అవుతాము. ఆత్మ తండ్రితో మాట్లాడుతుంది. శ్రీకృష్ణుడు ఏమైనా సర్వాత్మల తండ్రినా. ఆత్మల తండ్రి అయితే నిరాకారుడైన శివబాబా ఒక్కరే. ఆ హద్దులోని తండ్రి నుండి హద్దులోని వారసత్వము లభిస్తుంది, అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వము భారత్ కు లభిస్తుంది, అందుకే సత్యయుగాన్ని శివాలయము అని అంటారు. శివబాబా వచ్చి దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేసారు. ఇది సదా గుర్తుంచుకోవాలి. ఇది సంతోషకరమైన విషయం కదా. ఇప్పుడు మనం మళ్ళీ శివాలయములోకి వెళ్తాము. ఎవరైనా మరణిస్తే స్వర్గస్థులయ్యారు అని అంటారు, కానీ ఎప్పుడూ ఎవ్వరూ అలా వెళ్ళరు. ఇవన్నీ మనస్సును సంతోషపెట్టుకునేందుకు భక్తి మార్గములోని ప్రగల్భాలు.

నిజంగా స్వర్గములోకి అయితే ఇప్పుడు మీరు వెళ్ళనున్నారు. అక్కడ ఎటువంటి రోగాలూ మొదలైనవి ఉండవు. మీరు సదా హర్షితులుగా ఉంటారు. కావున తండ్రి ఎంత సహజతరం చేసి చిన్న-చిన్న పిల్లలకు అర్థం చేయించినట్లుగా అర్థం చేయిస్తారు. మీరు బయట ఎక్కడ ఉంటున్నా సరే పదవిని పొందవచ్చు, ఇందులో పవిత్రత మొట్టమొదట ముఖ్యమైనది, అన్నపానాదులు శుద్ధముగా ఉండాలి. దేవతల ముందు ఎప్పుడైనా సిగరెట్, బీడీ మొదలైనవాటిని భోగ్ గా పెడతారా? గ్రంథ్ ముందు ఎప్పుడైనా గుడ్లు లేక బీడీలు మొదలైనవాటి భోగ్ ను పెట్టారా? గ్రంథ్ ను గురుగోవింద్ శరీరముగా భావిస్తారు. గ్రంథ్ కు అంతటి గౌరవాన్ని ఇస్తారు, అది గురువు దేహము వంటిది అని సిక్కులు భావిస్తారు. కానీ గురునానక్ ఏమైనా కూర్చొని గ్రంథ్ ను వ్రాసారా. నానక్ అయితే అవతరించారు. సిక్కుల వృద్ధి జరిగింది, ఆ తర్వాత వారు గ్రంథ్ మొదలైనవాటిని వ్రాసారు. ఒక్కరి తర్వాత ఇక అనేకమంది సిక్కు ధర్మంలోకి రావడం మొదలుపెట్టారు. మొదట అయితే గ్రంథ్ కూడా ఎంతో చిన్నగా చేతితో వ్రాయబడినదిగా ఉండేది. ఇప్పుడు గీత విషయములో దానిని శ్రీకృష్ణుని రూపముగా భావిస్తారు. నానక్ యొక్క గ్రంథ్ ఎటువంటిదో అలా శ్రీకృష్ణుని గీత గానం చేయబడింది. శ్రీకృష్ణ భగవానువాచ అనే అంటూ ఉంటారు, దీనిని అజ్ఞానం అని అంటారు. జ్ఞానమైతే ఒక్క పరమపిత పరమాత్మలోనే ఉంది. గీత ద్వారానే సద్గతి లభిస్తుంది. ఆ జ్ఞానమైతే తండ్రి వద్దనే ఉంది. జ్ఞానము ద్వారా పగలు, భక్తి ద్వారా రాత్రి వస్తుంది. ఇప్పుడు తండ్రి అంటారు, ఆత్మను పవిత్రముగా తయారుచేసుకోవాలి, దాని కొరకు కష్టపడవలసి ఉంటుంది. మాయ తుఫానులు ఎంత శక్తివంతంగా వస్తాయంటే దాని ద్వారా జ్ఞానము పూర్తిగా ఎగిరిపోతుంది. దానిని ఎవ్వరికీ చెప్పలేరు కూడా. మొట్టమొదట కామ వికారమే ఎంతగానో విసిగిస్తుంది. అందులోనే సమయం పడుతుంది. వాస్తవానికి ఇది ఒక్క క్షణములో జీవన్ముక్తిని పొందే విషయము. కొడుకు పుట్టగానే యజమానిగా అయిపోతాడు. మీరు శివబాబా వచ్చారు అని గుర్తించడంతోనే వారసత్వానికి హక్కుదార్లుగా అయ్యారు. గీతను కూడా శివబాబాయే గానం చేసారు, వారే నన్నొక్కరినే స్మృతి చేయండి అని చెప్పారు. నేను ఈ సాధారణ తనువులోకి వస్తాను. శ్రీకృష్ణుడు ఏమైనా సాధారణమైనవారా. అతను జన్మ తీసుకున్నప్పుడు మెరుపులు మెరుస్తాయి, ఎంతో ప్రభావం పడుతుంది, అందుకే శ్రీకృష్ణుడిని ఈనాటి వరకూ గానం చేస్తారు. మిగిలిన శాస్త్రాలు మొదలైనవన్నీ భక్తి మార్గానికి చెందినవి. ఇంగ్లీష్ లో ఫిలాసఫీ అని అంటారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అయితే ఆత్మిక తండ్రే ఇవ్వగలరు. వారు స్వయం అంటారు - నేను మీ ఆత్మిక తండ్రిని, జ్ఞానసాగరుడను. పిల్లలైన మీరు కూడా తండ్రి నుండి నేర్చుకుంటున్నారు. జ్ఞానాన్ని ధారణ చేస్తున్నారు. ఇక చివరిలో తండ్రిలా అయిపోతారు. మొత్తం ఆధారమంతా ధారణపై ఉంది. ఆ తర్వాత ఆ శక్తి తండ్రి స్మృతి ద్వారా వచ్చేస్తుంది. స్మృతిని పదును అని అంటారు. ఖడ్గాలలో కూడా తేడా అయితే ఉంటుంది కదా. అదే ఖడ్గము 100 రూపాయలది కూడా ఉంటుంది. అదే ఖడ్గము 3-4 వేల రూపాయలది కూడా ఉంటుంది. బాబా అయితే అనుభవజ్ఞులు కదా. ఖడ్గానికి ఎంతో గౌరవము ఉంటుంది. గురుగోవింద్ సింగ్ ఖడ్గానికి ఎంత గౌరవము ఉంది. కావున పిల్లలైన మీలో కూడా యోగబలము కావాలి. జ్ఞాన ఖడ్గములో పదును కావాలి. పదును రావడంతో ఇక త్వరగా అర్థం చేసుకుంటారు. డ్రామా అనుసారంగా మీరు కష్టపడుతూ ఉంటారు. ఎంతెంతగా తండ్రిని స్మృతి చేస్తారో అంతంతగా స్మృతి ద్వారానే పాపాలు అంతమవుతాయి. పతిత-పావనుడైన తండ్రే యుక్తిని తెలియజేస్తున్నారు. మళ్ళీ కల్పం తర్వాత కూడా ఇదే విధముగా వచ్చి మీకు జ్ఞానాన్ని ఇస్తారు. ఇతని చేత కూడా అన్నింటినీ త్యాగం చేయించి ఇలాగే తమ రథంగా చేసుకుంటారు. పిల్లలైన మీకు అక్కడ ఎంత ఆకర్షణ కలిగింది. అందరూ ఎలా పరుగెత్తారు. తండ్రిలో ఆకర్షణ ఉంది కదా. ఇప్పుడు మీరు కూడా ఇలా సంపూర్ణముగా అవ్వాలి. నంబరువారుగానే అవుతారు. ఇక్కడ రాజధాని స్థాపన అవుతుంది.

సత్యయుగ ఆది నుండి కలియుగాంతం వరకూ సృష్టి చక్రాన్ని అయితే అర్థం చేసుకున్నారు. ఇప్పుడు ఇది సంగమయుగము. తండ్రికి కూడా పావనంగా తయారుచేయడానికి తప్పకుండా రావలసి ఉంటుంది. పావనము అనగా సతోప్రధానము. ఆ తర్వాత మలినాలు కలుస్తూ వచ్చాయి. ఇప్పుడు ఆ మలినాలు ఎలా తొలుగుతాయి? ఆత్మ సత్యముగా ఉంటే ఆభరణము కూడా సత్యమైనదిగా ఉంటుంది అనగా తెల్లటి శరీరము ఉంటుంది. ఆత్మ అసత్యముగా అయితే శరీరము కూడా పతితముగా అవుతుంది. జ్ఞానానికి ముందు ఇతను కూడా నమస్కారము, వందనము చేసేవారు. లక్ష్మీ-నారాయణుల పెద్ద ఆయిల్ పెయింట్ చిత్రము గద్దెపై ఉండేది. వారినే ఎంతో ప్రేమగా తలచుకునేవారు, ఇంకెవరినీ తలచుకునేవారు కారు. ఇంకెటువైపుకైనా ఆలోచనలు వెళ్తే - మనస్సు ఎందుకు పరుగెడుతుంది, దర్శనం ఎందుకు లభించడం లేదు అని తమకు తాము చెంపదెబ్బ వేసుకునేవారు. భక్తిలో ఉండేవారు కదా. తర్వాత ఎప్పుడైతే విష్ణువు దర్శనం కలిగిందో అప్పుడు దానితో ఏమైనా నారాయణుడిగా అయిపోయారా. పురుషార్థమైతే తప్పకుండా చేయవలసి ఉంటుంది, లక్ష్యము-ఉద్దేశ్యమైతే ఎదురుగా ఉంది. వీరు చైతన్యముగా ఉండేవారు, వీరి జడచిత్రాలను తయారుచేసారు. తండ్రి పావనంగా చేయడానికి వచ్చారు, నరుని నుండి నారాయణునిగా తయారుచేస్తారు. మీరు

కూడా వారి రాజధానిలో ఉండేవారు. మళ్ళీ ఈ విధంగా అయ్యేందుకు పురుషార్థం చేస్తారు కావున మంచి రీతిలో ఫాలో చేయాలి. బ్రహ్మను దేవత అని ఏమైనా అంటారా. విష్ణు దేవత అని అనడం సరైనది. మనుష్యులకు అయితే ఏమీ తెలియదు. గురుబ్రహ్మ, గురువిష్ణు... అని అంటారు. ఇప్పుడు విష్ణువు ఎవరికి గురువు అవుతారు? అందరినీ గురువు అని అంటూ ఉంటారు. శివ పరమాత్మాయ నమః అని అంటారు. వారిని గురువు అని, వీరిని పరమాత్మ అని అంటారు. అందరికన్నా పెద్దవారైతే తండ్రి కదా. ఇతరులకు నేర్పించేందుకు మనం వారి నుండి ఇది నేర్చుకుంటున్నాము. సద్గురువు మీకు ఏదైతే అర్థం చేయిస్తారో దానిని మీరు ఇతరులకు అర్థం చేయిస్తారు. గురువును వీరు తండ్రి, టీచర్ అని అనరు. నిజానికి ఈ జ్ఞానమంతా మీ బుద్ధిలో ఉండాలి. మనం శివాలయములో ఉండేవారము, ఇప్పుడు వేశ్యాలయములో పడి ఉన్నాము. మళ్ళీ ఇప్పుడు శివాలయములోకి వెళ్ళాలి. బ్రహ్మములో లీనమైపోయారని, జ్యోతి జ్యోతిలో కలిసిపోయిందని అంటారు కానీ ఆత్మ అయితే అవినాశీ. ప్రతి ఒక్కరిలోనూ తమ, తమ పాత్ర నిండి ఉంది. అందరూ పాత్రధారులే, వారు తమ పాత్రను అభినయించవలసిందే. అది ఎప్పుడూ అంతమవ్వదు. మొత్తం ప్రపంచమంతటి ఆత్మలు ఎవరైతే ఉన్నారో వారు పాత్రను అభినయించాలి. అక్కడ మళ్ళీ కొత్తగా షూటింగ్ ప్రారంభమైనట్లుగా ఉంటుంది. కానీ ఇది అనాదిగా షూటింగ్ అయిపోయి ఉంది. ఈ ప్రపంచ చరిత్ర-భౌగోళము రిపీట్ అవుతూ ఉంటుంది. ఇది అద్భుతమైన సితార, ఇది భృకుటి మధ్యలో మెరుస్తూ ఉంటుంది. ఇది ఎప్పుడూ అరగదు. ఈ జ్ఞానము ఇంతకుముందు మీలో ఉండేది కాదు. ఇది వండర్ ఆఫ్ ది వరల్డ్. హెవెన్ లేక స్వర్గము యొక్క పేరును విని మనస్సు సంతోషపడుతుంది. ఇప్పుడైతే సత్యయుగము లేదు. ఇప్పుడిది కలియుగము. కావున పునర్జన్మలను కూడా కలియుగములోనే తీసుకుంటారు. అందరూ తప్పకుండా వెళ్ళవలసిందే కానీ పతిత ఆత్మలు వెళ్ళలేవు. ఇప్పుడు పిల్లలైన మీరు యోగబలం ద్వారా పావనంగా అవుతారు. పావన ప్రపంచాన్ని గాడ్ ఫాదరే స్థాపన చేస్తారు. తర్వాత రావణుడు నరకముగా తయారుచేస్తాడు. ఇది ప్రత్యక్షముగా ఉంది కదా. రావణుడిని కాలుస్తారు కదా. మనుష్యులైతే ఇది అనాదిగా నడుస్తూ వస్తోంది అని అంటారు. కానీ ఎప్పటి నుండి ప్రారంభమవుతుంది, ఇది కూడా ఎవరికీ తెలియదు. దీనిని సగం-సగం అయితే చేయలేరు ఎందుకంటే వారు లక్షల సంవత్సరాలు అని అనేస్తారు. కలియుగానికి మళ్ళీ 40,000 సంవత్సరాలు అని అనేస్తారు. కావున మనుష్యులు ఘోర అంధకారములో ఉన్నారు కదా. అజ్ఞాన నిద్ర నుండి మేల్కొలపడం చాలా కష్టము, వారు మేల్కొనే మేల్కోరు. ఇప్పుడిది సంగమయుగము, ఇప్పుడు తండ్రి వచ్చి పావనముగా అయ్యే యుక్తిని తెలియజేస్తారు. మీరు పావనముగా అయినట్లయితే పావన ప్రపంచ స్థాపన జరిగే తీరుతుంది. ఈ పతిత ప్రపంచమే అంతమైపోతుంది. ఇప్పుడిది ఎంత పెద్ద ప్రపంచము. సత్యయుగములోనైతే ప్రపంచం చాలా చిన్నగా అయిపోతుంది. ఇప్పుడు మాయపై విజయాన్ని పొంది పావనంగా తప్పకుండా అవ్వాలి. తండ్రి అంటారు, మాయ చాలా శక్తివంతమైనది. పావనంగా అవ్వడంలోనే అనేక రకాల విఘ్నాలను కలిగిస్తుంది. పవిత్రముగా అవ్వాలి అని ధైర్యాన్ని ఉంచుతారు, మళ్ళీ మాయ వచ్చి ఎటువంటి పరిస్థితిని తయారుచేస్తుంది. గట్టిగా దెబ్బ వేసి పడేస్తుంది. చేసిన సంపాదనంతా అంతం చేసేస్తుంది. అప్పుడిక ఎంతో కష్టపడవలసి వస్తుంది. కొందరు పడిపోతారు, ఆ తర్వాత మళ్ళీ ముఖము కూడా చూపించరు, ఇక వారు అంతటి ఉన్నత పదవిని పొందలేరు. పురుషార్థం పూర్తిగా ఉండాలి. ఫెయిల్ అవ్వకూడదు. అందుకే కొందరు గంధర్వ వివాహం కూడా చేసుకొని చూపిస్తారు. సన్యాసులు అంటారు, వివాహం చేసుకొని పవిత్రముగా ఉండడం అసంభవం అని. తండ్రి అంటారు, ఇది సంభవమే, ఎందుకంటే ఇందులో ప్రాప్తి ఎంతో ఉంది. ఈ ఒక్క అంతిమ జన్మలో మీరు పవిత్రముగా అయినట్లయితే మీకు స్వర్గ రాజ్యాధికారం లభిస్తుంది. ఇంత గొప్ప ప్రాప్తి కొరకు మీరు ఒక్క జన్మ పవిత్రముగా ఉండలేరా? బాబా, మేము తప్పకుండా ఉంటాము అని అంటారు. సిక్కులు కూడా పవిత్రతా కంకణాన్ని కట్టుకుంటారు. ఇక్కడ దారము మొదలైనవేవీ కట్టుకోవలసిన అవసరం లేదు. ఇది అయితే బుద్ధి విషయము. తండ్రి అంటారు, నన్నొక్కరినే స్మృతి చేయండి. కుమార్తెలు చాలామందికి వినిపిస్తారు కానీ గొప్ప వ్యక్తుల బుద్ధిలో ఏమైనా కూర్చుంటుందా. తండ్రి అంటారు, మొదట వారికి మంచి రీతిలో అర్థం చేయించండి - వీరంతా ప్రజాపిత బ్రహ్మ సంతానము అని. శివబాబా ద్వారా వారసత్వము లభిస్తోంది. పతితుల నుండి పావనులుగా అవ్వాలి. ఇప్పుడు తండ్రి అంటారు, నన్నొక్కరినే స్మృతి చేయండి. ఈ విధంగా ఇంకెవ్వరూ అనలేరు. మొదటైతే వారి బుద్ధిలో ఇది కూర్చోబెట్టాలి - భారత్ నిర్వికారిగా ఉండేది, ఇప్పుడు వికారీగా అయ్యింది, మళ్ళీ నిర్వికారిగా ఎలా అవుతుంది? భగవానువాచ, నన్నొక్కరినే స్మృతి చేయండి. ఈ కాస్త చెప్పినా కూడా అహో భాగ్యమే, కానీ ఇంత కూడా చెప్పలేరు, మర్చిపోతారు. బాబా అయితే అర్థం చేయించారు - ప్రారంభోత్సవాన్ని అయితే తండ్రి చేసేసారు, మిగిలినది మీరు నిమిత్తముగా చేస్తున్నారు. పునాదినైతే వేసేసారు, ఇకపోతే ఇప్పుడు సర్వీస్ స్టేషన్ల ప్రారంభోత్సవం జరుగుతుంది. ఇది గీత యొక్క విషయమే. గీతలో కూడా ఉంది - ఓ పిల్లలూ, మీరు కామముపై విజయాన్ని పొందినట్లయితే ఈ విధంగా 21 జన్మల కొరకు జగత్ జీతులుగా అవుతారు. స్వయం అలా అవ్వకపోయినా కానీ ఇతరులకైనా అర్థం చేయించండి. ఇతరులను పైకెత్తి స్వయం పడిపోయేవారు

కూడా ఎందరో ఉన్నారు. కామము మహాశత్రువు, అది పూర్తిగా బురదలో పడేస్తుంది. ఏ పిల్లలైతే కామముపై విజయాన్ని పొందుతారో వారే జగత్ జీతులుగా అవుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ అంతిమ జన్మలో సర్వ ప్రాప్తులనూ ఎదురుగా ఉంచుకొని పావనముగా అయి చూపించాలి. మాయ విఘ్నాలతో ఓడిపోకూడదు.

2. లక్ష్యము-ఉద్దేశ్యమును ఎదురుగా ఉంచుకొని పూర్తి పురుషార్థము చేయాలి. ఏ విధంగా బ్రహ్మాబాబా పురుషార్థము చేసి నరుని నుండి నారాయణునిగా అవుతారో అలా వారిని ఫాలో చేసి సింహాసనాధికారులుగా అవ్వాలి. ఆత్మను సతోప్రధానముగా తయారుచేసుకునే కృషి చేయాలి.

వరదానము:- అధికారిగా అయ్యి సమస్యలను ఆడుతూ-పాడుతూ దాటివేసే హీరో పాత్రధారీ భవ

పరిస్థితులు, సమస్యలు ఎటువంటివైనా కానీ సమస్యలకు ఆధీనమవ్వకుండా అధికారిగా అయ్యి సమస్యలను ఎలా దాటివేయండంటే, ఆడుతూ-పాడుతూ దాటివేసినట్లుగా దాటివేయాలి. బయటకు ఏడ్చే పాత్ర అయినా కానీ లోపల మాత్రం ఇది అంతా ఆట అని అనుకోవాలి - దీనినే డ్రామా అని అంటారు మరియు మనము డ్రామాలోని హీరో పాత్రధారులము. హీరో పాత్రధారి అనగా ఖచ్చితమైన పాత్రను పోషించేవారు. అందుకే కఠినమైన సమస్యను కూడా ఆటగా భావించి తేలికగా చేయండి, ఎటువంటి భారము ఉండకూడదు.

స్లోగన్:- సదా జ్ఞాన స్మరణలో ఉన్నట్లయితే సదా హర్షితముగా ఉంటారు, మాయ ఆకర్షణల నుండి రక్షింపబడతారు.